# మెంనలేని శిఖరం

జనార్ధం చచ్చిపోయ్యాడని తెలిసినప్పుడు, నేననెంత ఆశ్చర్యపోయ్యానో ను వ్వర్థంచేసుకోలేవు. జనార్ధనం మృత్యుంజయుడని నే నెప్పుడూ అనుకోలేదు. ఎప్పుడో ఒకప్పుడు, పుట్టిన ప్రతి ప్రాణీ చనిపోకతప్పదని నాకు తెలుసు. అయినా జనార్ధనం మరణం నన్ను ఆశ్చర్యంలో ముంచింది.

జనార్ధనం ఆత్మహత్యచేసుకొన్నాడు. మామూలు చావులు నాకాట్టే ఆశ్చర్యంకలిగించవు. కొందరి ఆత్మహత్యలు గూడా నన్ను ఆశ్చర్యపరచవు. మృత్యువనేది జీవి చేరవలసిన చివరిమజిలీ అయినపుడు, విచారించటానికి, వాపోవటానికి కారణం కనబడదు.

బ్రతుకంతా బాధలతో నిండిపోయిన వ్యక్తి, హఠాత్తుగా ఆత్మహత్య చేసుకొంటే నా కిట్టే అర్థమయిపోతుంది. గంపెడు కష్టాలతో నకనకలాడిపోతున్న ఓ సామాన్య మానవుడు ఉరెట్టుకున్నా నా కర్థమవుతుంది. తిండిలేక, పని లేక, బ్రతుకుమీద ఆశలేక, గుక్కెడు ప్రాణాలనూ 'హరీ' మనిపించుకొన్నవారిని నేను సులభంగా ఆమోదించగలను. సంవత్సరాలతరబడి రోగాలతో పతనమయినవారూ, జీవిత కావ్యాలకు, ఆకస్మికంగా భరతవాక్యం చెప్పటం నాకు తెలుసు.

ఇలాంటివని నేను ఆమోదిస్తున్నానని అర్థంచేసుకోకు. ఈ నికృష్టప్రాణులపట్ల నా సానుభూతి ఎప్పుడూ ఉండనేఉంది.

వారికోసం నా కన్నీరు చాలా ఖర్చుపెట్టాను. వారు నా కావ్యాలకు వస్తువులుగా ఉపయోగపడ్డారు.

జనార్దనం వీటన్నింటికి అతీతుడు. నాకు తెలిసినంత వరకూ, అతని కలాంటి బాధలూ లేవు. ఎప్పుడూ, ఎక్కడా, దేనికీ అతను ఇబ్బందిపడలేదు. దరిద్రం అతని కర్థంకాదు. కష్టాలు అతనికి కొరకరాని కొయ్యల్లాంటివి. వివాద స్వరూపం ఎలా ఉంటుందో జనార్దనం ఎప్పుడూ అర్థంచేసుకోలేదు.

జనార్దనం లేడుగనుక, ఇప్పుడు చెబుతున్నా. అతనంటే నాకు లోపల్లోపల చాలా మంటగా ఉండేది. జనార్దనం నేడు జ్ఞాపకంవచ్చినప్పుడల్లా, నా గుండెల్లో పొగలూ, సెగలూ లేచేవి. అసూయతో కుతకుతలాడిపోయేవాణ్ని. అయితే, నే నిలా అయిపోతున్నట్టు, జనార్దనానికి తెలీదు. తెలియకుండా జాగ్రత్తపడేవాణ్ని. అతను కనిపించగానే ఆప్యాయతను అద్దెకు తెచ్చుకునేవాణ్ని. ఆదరాన్ని అరువుగా పుచ్చుకొని, మంద హాసం ముఖానికి తగిలించుకొని, మాటల్ని తేనెలో రంగరించి గానీ వెలుపలికి రానిచ్చేవాణ్నిగాను. నే నిలా చేస్తున్నట్టు జనార్దనానికి ఈనాటికీ తెలీదు. అయినా మరో నిజాన్ని ఒప్పుకోవాలి. ఎంత నటించినా, జనార్ధనమంటే నాకు వల్లమాలిన అభిమానముంది. నాలో మృగ్యమైన అనేక సద్గుణాలు అతనిలో ఉన్నాయి. ఏనాటికయి నా ధ్యేయం జనార్ధనమే. అంత మంచిగానూ ఉండటనే.

నేను, అతన్ని చూసి అసూయ పడుతుండేవాణ్నని చెప్పానుగదూ. అతనూ నన్నుచూసి ఇలాగే ఫీలయ్యేవాడుట. ఈసంగతి అతనే ఓసారి నాతో అన్నాడు.

నేనేదో మహా సుఖించిపోతున్నానని జనార్ధనం అభిప్రాయం. నాలాంటి సుఖమయప్రాణి, తను చూచినంత వరకూ లేడంటాడు, జనార్ధనం. భగవంతుడు తన కిలాంటి జీవితాన్నివ్వగూడదా-అంటూంటా డతను.

జనార్ధనాన్ని మీరెవ్వరూ చూసిఉండరనుకొంటాను. పదిలక్షలమందిలో ఉన్నా అతన్ని నే నిట్టే గుర్తింపగలను. కోటికోట్ల గొంతుకల్లో, అతని కంఠస్వరాన్ని చప్పున పోల్చుకో గలను.

జనార్ధనం ఎప్పుడూ నిరుత్సాహంగా నిరుద్రేకంగా ఉండేవాడు. అసంతృప్తి భూతం అనవరతం అతన్ని ఆశ్రయించి ఉండేది. ఎప్పుడూ నవ్వడు, అథవా నవ్వాడో, ఎవరో తన్ని నవ్వించినట్లుండే దా నవ్వు తనలో తనే దేని కోసమో వెదుకుతున్నట్టుండేవాడు. ఒకసారి నేను జనార్ధనా న్నడిగాను-

"మిష్టర్, ఎప్పుడూ ఎందు కలా దిగులుగా ఉంటావ్. జీవితంలో నీ కన్నీ ఉన్నాయిగదా. దేనికీ లోటులేదుగదా. ఎందు కలా విచారంగా ఉంటావ్ ?"

"నాచుట్టూ ఉన్నవన్నీ; నాకు అవసరం లేనివి. నాకు అవసరంఉన్నవన్నీ నాకు దూరంగా ఉన్నాయి"

అన్నాడు జనార్దనం. అదే ఆరోజున అంతటితో మా సంభాషణ ఆగిపోయింది. ఇంటికెళ్ళి ఆరుబయట వెల్లకితలా పడుకుని దీర్ఘంగా ఆలోచించాను, జనార్ధనానికేం కావాలా అని. అత నెందుకింతలా మథనపడుతున్నాడా అని ప్రశ్నించు

కొన్నాను. దేనికోసం అలా వెదుకుతున్నాడా అని ఆలోచించాను. ఆలోచిస్తూనే నిద్రపోయాను;

మరోసారి కలుసుకొన్నప్పుడు అతన్నే అడిగాను. జనార్ధనం నవ్వాడు. అత నెలా నవ్వుతాడో ఇదివరకే మీకు చెప్పాను గదూ? అలానే అప్పుడూ జనార్ధనం నవ్వి—

"ఏం లేదోయ్. అది నాస్వభావం మరింకేమీ నన్ను ప్రశ్నించకు."

అంటూ తప్పుకోజూచాడు జనార్ధనం. అయినా చెప్ప వలసినదేనని నేను పట్టుబట్టాను. ఈసారి అతను దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు. జేబుగుడ్డతో ముఖమంతా ఓసారి తుడుచుకొన్నాడు.

"క్షమించాలి బ్రదర్. నేను దేనికోసమూ వెదకడం లేదు. నన్ను నేనే వెదుక్కుంటున్నాను. నే నెక్కడో తప్పిపోయాను. ఎక్కడఎప్పుడుతప్పిపోయానో తెలీడం లేదు. కానీ, తప్పిపోయానని మాత్రం రూఢిగా తెలుసు. ఇపుడు అర్ధమయిందా నేను దేన్ని వెతుకుతున్నానో?" అన్నాడు జనార్ధనం. అప్పు డే మన్నానో జ్ఞాపకంలేదుగానీ. నాకు మాత్రం అతని మాటలు అర్థంకాలేదు. మీ కేమైనా అర్థమయ్యాయా?

ఈ సాయంత్రమే అతన్ని కలుసుకొని, సరాసరి సంభాషణలోకి దింపి, అసలు విషయం తేలుద్దామనుకొన్నాను. కానీ అతను అనుకోనివిధంగా ఆత్మహత్య చేసుకొన్నాడు. నిన్నసాయంత్రం జనార్ధనం అన్న మాటలకూ ఆరాత్రే అతను అమలుజరిపిన ఆత్మహత్యకూ ఏదో సంబంధమున్నదని పించింది నాకు. ఒకవేళ లేదేమో? ఉన్నదనే అనుకొంటున్నా

నేమో? నాకు తెలీని మరో బలవత్తరమైన కారణం ఏదన్నా ఉన్న దేమో?

సందేహ నివృత్తికోసం జనార్ధనంగారింటి కెళ్ళాను. ఇల్లంతా అదోలా ఉంది. ఎప్పుడూ లేని సంచలన మేదో ఆ ఇంట్లో నాకు గోచరించింది. జనార్ధనం భార్యను ప్రక్కకు పిలిచి అసలు విషయమేమిటని అడిగాను.

"ఏమోనండీ, అంతా మాయగా ఉంది. ఆయన్ని గురించి మీకు తెలీనిదేమీ లేదు గదా. ఏసంగతీ నాతో చెప్పరు. చెప్పమని నేనూ బలవంతం చెయ్యను." అన్నది జనార్ధనం భార్య.

"ఎందుకు?" అని అన్నాను.

"అనవసరంగా ప్రశ్నించి వారి మనస్సు కష్టపెట్టడం నా కిష్టంలేదు. నాతో చెప్పేదయితే, వారే చెబుతారుగదా అనే ఉద్దేశంతో, నేనేమీ వారిని గుచ్చిగుచ్చి అడగను" అన్నదామె.

"నిన్న మీ రిద్దరూ ఘర్షణగానీ పడ్డారా?" అన్నాను.

"లేదు. అబ్బాయి పెళ్ళివిషయంమాత్రం ప్రస్తావించాను, చెబుతున్నంతసేపూ మౌనంగా విన్నారు. అంతా అయ్యాక, ఈ పెళ్ళి జరగటం తన కిష్టంలేదన్నారు" అన్నదామె.

"మీ రేమన్నారు?"

"ఏమంటాను ఒక్కసారి మన పెళ్ళినాటి సంగతులు జ్ఞాపకంచేసుకోమన్నాను. అప్పట్లో వా రెలా మా యింటి చుట్టూ తిరిగారో, ఇప్పుడు మురళికూడా పద్మఇంటిచుట్టూ

అలానే తిరుగుతున్నాడన్నాను. పద్మ రాసిన ఉత్తరాలుగూడా వారికి చూపించాను. ఆయన భగ్గున మండిపడ్డాడు. ఆ ఉత్త రాలన్నీ ముక్కలు కింద చింపి పారేసి, ఎక్కడికో వెళ్ళారు" అన్నది జనార్ధనం భార్య.

సరాసరి నా దగ్గరకే వచ్చారమ్మా" అన్నాను.

"మీతో ఈ విషయమేమీ అనలేదాండీ?"

"లేదు...అయితే జనార్ధనం ఆత్మహత్యకు ఇదే కారణమంటారా?" అని అడిగాను.

"నాకు తెలీదు. జీవితంలో మొదటిసారీ, చివరి సారీ గూడా నిన్ననే ఆయనతో సంఘర్షణపడ్డాను. మీరు కాదన్నా మురళివివాహం పద్మతో అవుతుందని గట్టిగా చెప్పాను. అందుక్కావలసిన ఏర్పాట్లన్నీ నేనే స్వయంగా చేస్తానన్నాను కొడుకుమీది ప్రేమకొద్దీ, నిన్న ఆమాటలన్నాను అన్నగారూ గట్టిగా చెపితేనన్నా వింటారనుకొన్నాను. కాని ఆయన, నా పసుపు కుంకమే పట్టుకెళ్ళా రన్నయ్యా"

అంటూ ఏడ్చింది జనార్ధనం భార్య. అతని చావుకు తనే కారణమని ఆవిడ అభిప్రాయం. మరి మురళి ఏమనుకుంటు న్నాడో తెలుసు కొందామని అతన్ని పిలిచి అడిగాను.

"నాకేమీ పాలుపోవడంలేదు మావయ్యా. నాన్న చనిపోవడానికి నేనే ముఖ్య కారణం. పద్మను చేసుకొంటానని అమ్మతో చెప్పడానికి ముందు, నాన్నతోనూ అడ్డాను. ఆయనెందుకో గట్టిగా ఎదురు తిరిగాడు. నేనూ మరింత మొండికెత్తాను. దీనికి మీరొప్పుకోకపోతే ఇంట్లోంచి వెళ్ళి పోతానని చెప్పాను. నాన్న బదులేమీ చెప్పలేదు. రెండు

చేతుల్లోనూ ముఖం దాచుకొన్నాడు. ఆయన కళ్ళవెంట నీరు కారడం నిన్ననే చూశాను. ఈ దిక్కుమాలిన పద్మ గొడవతో నాన్నే మాకు దూరమయ్యాడు మావయ్యా" అన్నాడు మురళి. తనంతగా పట్టుబట్టడంవల్లనే జనార్ధనం చని పోయాడని మురళి భావిస్తున్నాడు. జనార్ధనం చావుకు ఇప్ప టికి రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఆయన భాగస్తు డేమంటాడో తెలుసుకొందామని, అతన్నీ అడిగాను.

"బాబూ, తప్పంతా నాది. జనార్ధనంతో చెప్పకుండా పట్నం బేరం చేశాను. అనుకోకుండా మూడు లక్షలరూపా యల నష్టంవచ్చింది. ఈ సంగతి జనార్ధనంతో ఎలా చెప్ప డమో తెలీక గింజుకు ఛస్తున్నాను. ఏ గుమాస్తాగాడన్నా ఆయనచెవిన వేశాడేమో నాకు తెలీదు. ఆయనమాత్రం రాత్రికి రాత్రే దాటిపోయాడు. ఈ ముదనష్టపుబేరం చెయ్యక పోయినా బాగుండేది. ఏదో బావుకొందామని దూరాను. తోబుట్టువులాంటి భాగస్తుని పోగొట్టుకొన్నాను."

జనార్దనం ఆత్మహత్యకు మూడో కారణం తెలిసింది. ఇలా ఎందరిని కలుసుకొని అడిగితే, అన్ని కారణాలు కని పించొచ్చు. ఇవన్నీ సరైన కారణాలుగూడా కావచ్చు. కానీ, వీటన్నింటినీ మించిందేదో ఉండాలనిపించుతోంది నాకు. సరాసరి జనార్ధనంగదిలో కెళ్ళాను. బల్లమీద అతని డైరీ వుంది. ఆ డైరీలో అతని ఆత్మహత్యకు కారణం దొరకవచ్చు ననిపించింది. గబగబా పేజీలు తిప్పాను.

జూన్ 16 న జనార్ధనం ఇలా రాశాడు.

(ఆరుగంటలకు లేచాను. కాలకృత్యాలు. ఏడింటికి కాఫీ. గంటసేపు పేపరు. ఆఫీసు కెళ్ళాను. ఉత్తరాలు చదివాను. 12 గంటలకు ఇంటికొచ్చాను. అన్నం తిన్నాను. 3 గంటలదాకా నిద్ర. మూడున్నరకు ఫలహారం, టీ. కాస్సేపు రేడియో విన్నాను. పార్కు-కెళ్ళాను. 8 గంటలకు ఇంటికొచ్చాను. ఎనిమిదిన్నరకు స్నానం, భోజనం, 9 గంటలకు నిద్ర.)

జూన్ 17 న ఇలా రాశాడు.

(ఆరుగంటలకు నిద్రలేచాను. కాలకృత్యాలు, ఏడింటికి కాఫీ...మిగతాదంతా నిన్నలాగే జరిగింది.)

జూన్ 18 న ఇలా ఉంది.

(అంతా పూర్వంలాగే ఉంది. తూచా తప్పకుండా. గాడిలో బండిలా జరిగిపోయింది.)

జూన్ 19 న...

(జీవితం గానుగెద్దులా నడిచిపోతోంది. ఓ మార్పు లేదు. సంఘర్షణలేదు. ఉత్సాహంలేదు. ఆశలేదు. నిరాశలేదు. బాధగా, మొండిగా సాగిపోతోంది. ప్రతిరోజూ, అదే సూర్యుడు, అదే ఎండ, అదే గాలి, అదే భార్య, అదే కొడుకు, అదే ఆఫీసు, అదే ఇల్లు, అదే తిండి, అదే నిద్ర, లేవడం, తిండితినడం, పేపరు చదవడం, ఆఫీసు కెళ్ళడం, డబ్బు సంపాదించడం, ఖర్చుపెట్టడం, మళ్ళీ తిండి, మళ్ళీ నిద్ర, మళ్ళీ మేలుకోవడం, అంతా మామూలే. ఓ నవ్యత లేదు.

పరిణామం లేదు. యాభై ఏళ్ళు ఇలా గడిపాను. ఆయువుంటే మరో యాభై యేళ్ళు ఇలానే గడుస్తాయి. మరొకవూర్వంటూ ఏదీరాని పక్షంలో, గడచిన సంవత్సరాల్లాగే రానున్న నాజీవితం గడపడం ఎందుకు?)

జూన్ 20 న...

(భగవంతుడు నా కిలాంటి రాతనెందుకు రాయాలి? చాలామంది నన్ను చూసి అదృష్టవంతుణ్ణంటారు. కట్టుకు పోయినంత డబ్బుంది. ప్రేమించి పెళ్ళిచేసుకొన్న భార్య, లాభాలిచ్చే వ్యాపారం, లక్షలు సంపాదించే మిల్లులు, భూములు, బాగా చదువుకొంటున్న ముగ్గురు పిల్లలు. ఇవన్నీ కలిసి, జీవితంమీద నాకు ఆసక్తిలేకుండా చేశాయి. ఏదో సాధించాలన్న ఉత్సాహన్నే నాలోంచి పీకిపారేశాయి. వారాలనుండీ నే నాలోచిస్తున్నాను. జీవించి చెయ్యగలిగిందేమిటి—అని. ఏమీ కనిపించలేదు. సాధించిన వస్తువును పొందడంకోసం, చేసే ప్రయత్నంలోనే, జీవితమాధుర్యమూ, జీవితాసక్తీ ఉంటాయి. ఆ వస్తువు ఏ నాటికీ అందకపోతే, ఆ వ్యక్తికన్నా అదృష్టవంతుడు మరొకడుండడు. దురదృష్ట వశాత్తూ నేను కోరినవన్నీ నా చుట్టూ ఉన్నాయి. అంచాతే వాటిపట్ల నాకు మొఖంమొత్తింది. జీవితంలో తీరని కోరిక లంటూ కొన్ని ఉండి, వాటి సాఫల్యతకోసం కృషిచేయడ మన్నదే లేకపోతే, ఆ జీవితం నిరర్థకం, నిష్ప్రయోజనం, నిరుపయోగం. కలలుగనడానికి అవకాశమే లేని బ్రతుకుకన్నా నరకాన్ని నే నూహించలేను.

ప్రస్తుతం, నే నలాంటి నరకంలోనే ఉన్నాను. కోరడానికీ, కలలుగనడానికీ, నాకు అవకాశంలేదు. ఒడుగూ దోడుగూ లేని ఈ ఎడారిజీవితంమీద విసుగెత్తింది. ఇది కారణంగానే ఈ జీవితానికి ఇక్కడ ఫుల్‌స్టాప్ పెట్టాలని గట్టిగా నిశ్చయించుకొన్నాను.)

అని రాశాడు జనార్దనం. అతను రాసింది నిజమా కాదా అన్నది నేడు పరీక్ష. దురదృష్టవశాత్తూ తన కన్నీ ఉన్నాయనుకొంటున్నాడు జనార్దనం. కానీ అది నిజం కాదు. తనకున్న అన్నింటినీ, సమన్వయంచేసుకొని సుఖించగల జీవితసూత్రం అతనికి అందుబాటులో లేదు. జీవితంనుండి ఆనందం పొందగల నేర్పు అతనికి లేదు. జనార్ధనం నిజంగా శిఖరంలాంటివాడు—కానీ—ఆ శిఖరానికి మొనలేదు.

———